క్లుప్తంగా

కంపుకొడుతున్న కూరగాయల మార్కెట్


పేరుకుపోయిన కుళ్లిన కూరగాయలు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని జుబ్లీ కూరగాయల మార్కెట్‌లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో కంపు కొడుతోంది. వ్యాపారులు, వినియోగదారులు దుర్గంధం భరించలేక పో తున్నారు. పారిశుధ్య లోపంతో దోమలు విజృంభిస్తున్నాయి. మున్సిపల్ అధికారులు మార్కెట్‌లో నిత్యం పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టాలని వ్యాపారులు, వినియోగదారులు కోరుతున్నారు.

పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ


పనులు ప్రారంభిస్తున్న అధికారులు

కెరమెరి: ఉపాధి పనుల జాతర కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఝరి గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి శుక్రవారం ఎంపీడీవో అమ్జద్‌అలీ, డీటీ సంతోష్‌కుమార్ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, ఈసీ అక్యానాయక్, మాజీ వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం, నాయకులు ఆత్రం లక్ష్మణ్, మునీర్ అహ్మద్ తదితరులున్నారు.

ఘనంగా పొలాల అమావాస్య


బసవన్నలను ఊరేగిస్తున్న రైతులు

కౌటాల: మండలంలోని వీర్దండి గ్రామంలో శుక్రవారం పొలాల అమావాస్య పండుగను ఘనంగా జరుపుకున్నారు. పొలాల అమావాస్య సందర్భంగా రైతులు ఎద్దులను నీళ్లతో శుభ్రం చేసి, అందంగా అలకరించారు. స్థానిక ఆలయం వద్దకు బసవన్నలను తీసుకెళ్లి ఆలయం చుట్టూ ప్రదక్షిణాలు చేయించారు. అనంతరం నైవేద్యాలు సమర్పించారు. దీంతో గ్రామంలో పొలాల అమావాస్య సందడి నెలకొంది.

గోయగాంలో గాజుల పండుగ


మహిళలకు గాజులు తొడుగుతున్న సుగుణ

కెరమెరి: మండలంలోని గోయగాంలో గురువారం రాత్రి పీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ గాజుల పండుగ నిర్వహించారు. ఇందిరా ఫెలోషిప్ ఆధ్వర్యంలో కొనసాగిన ఈ కార్యక్రమంలో అనేకమంది మహిళలు పాల్గొనగా వారి నుదుట కుంకుమ పెట్టి పసుపు పూసిన గాజులు తొడిగారు. ఈ సందర్భంగా మహిళలు ఆమెను శాలువాలతో సత్కరించారు.

ఇంకుడుగుంతల నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న విశ్వప్రసాద్

లింగాపూర్: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఇంకుడుగుంతల నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వప్రసాద్, ఎంపీడీవో రామచందర్, ఏపీవో చంద్రయ్య, లోకేందర్ పాల్గొన్నారు.

ఏరియాలో డీఎంఎస్ పర్యటన

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలో శుక్రవారం హైదరాబాద్ రీజియన్‌- 2 డీఎంఎస్(డైరెక్టర్ మైన్స్ సేఫ్టీ) ఎస్.నాగేశ్వర్‌రావు పర్యటించారు. ఈ సందర్భంగా ఏరియా జనరల్ మేనేజర్ విజయ భాస్కర్‌రెడ్డితో కలిసి ఏరియాలోని కైరిగూడ ఓసీపీ సందర్శించి పని స్థలాలు పరిశీలించారు. ఓసీపీలో రక్షణ ఏర్పాట్ల విషయంలో ఏరియా మైనింగ్ అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం వట్టివాగు రక్షణ కట్ట నిర్మాణ పనులు పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. రక్షణ పరికరాల వివరాలను ఏరియా మైనింగ్ అధి కారులు వివరించారు. కార్యక్రమాల్లో ఎస్ వోటూజీఎం కె.రాజమల్లు, పీవో ఉమాకాంత్, ప్రాజెక్టు ఇంజినీర్ వీరన్న, మేనేజర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

యువ వికాసం జాడేది?

- ఎదురుచూస్తున్న అభ్యర్థులు
- అమలుపై స్పష్టత కరువు


దరఖాస్తు చేసుకుంటున్న అభ్యర్థులు (ఫైల్)

ఆసిఫాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతీయువకులకు చేయూత అందించేందుకు రాజీవ్ యువ వికాసం పథకం తీసుకువచ్చింది. ఈ నేపథ్యంలో వారికి స్వయం ఉపాధి కల్పనకు రుణాలు పంపిణీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానించింది. దీంతో జిల్లాలో చాలామంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. ధ్రువపత్రాల పరిశీలన కూడా పూర్తి చేసి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజు మొదటి విడతలో రుణ మంజూరు పత్రాలు అందజేస్తామని చెప్పిన ప్రభుత్వం చివరి క్షణంలో వాయిదా వేసింది. దీంతో అభ్యర్థుల ఆశ నిరాశే అయింది.

దరఖాస్తుదారుల్లో నిరాశ

జూన్ 2 రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజు మంజూరు పత్రాలు ఇవ్వలేదు. తిరిగి ఎప్పుడు ఇస్తారనే దానిపై స్పష్టత లేక పోవడంతో వారు ఎదురుచూస్తున్నారు. రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి చెక్కులు పంపిణీ చేస్తామని చెప్పి ఇవ్వక పోవడంతో చాలా మంది నిరాశకు గురయ్యారు. వచ్చే నెలలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం యోచిస్తోంది. ఈ లోపే రుణాలు ఇవ్వాలని అభ్యర్థులు కోరుతున్నారు.

జిల్లాలో 30,022 దరఖాస్తులు

జిల్లా వ్యాప్తంగా అన్ని కేటగిరీల్లో కలిపి మొత్తం 30,022 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. 8,879 యూనిట్లు మంజూరయ్యాయి. వీటిలో మైనార్టీల దరఖాస్తులు 2,677 రాగా 499 మందికి, 33 క్రిస్టియన్ దరఖాస్తులు రాగా 25 మందికి, ఈబీసీ/ఈడబ్ల్యూఎస్ దరఖాస్తులు 413 రాగా 470 మందికి, ఎస్టీ దరఖాస్తులు 7,370 రాగా 3,855 మందికి, ఎస్సీ దరఖాస్తులు 6,939 రాగా 2,185 మందికి యూనిట్లు మంజూరయ్యాయి. 18 నుంచి 55 ఏళ్లలోపు నిరుద్యోగులకు రుణాలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో జిల్లాలో భారీగా దరఖాస్తులు వచ్చాయి. అభ్యర్థులు ఎంచుకున్న యూనిట్ ఆధారంగా రూ.50 వేల నుంచి రూ.4లక్షల వరకు రుణాలు ఇచ్చేందుకు ప్రభుత్వ ఈ పథకాన్ని రూపొందించింది.

ముగిసిన 'శ్రావణ' పూజలు


ఆసిఫాబాద్: వాసవీ మందిరంలో ప్రత్యేకాలంకరణలో వాసవీమాత


కెరమెరి: బెల్లం మొక్కు తీర్చుకుంటున్న భక్తులు


రెబ్బెన: అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఆసిఫాబాద్/కెరమెరి: శ్రావణ మాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని జిల్లాలోని ఆయా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అర్చకుడు ముదిగొండ రాజశేఖరశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పూలతో ప్రత్యేకాలంకరణ చేశారు. ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహాలక్ష్మి ఆలయంలో అర్చకుడు శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజ లు నిర్వహించగా ఆలయం భక్తులతో సందడిగా మారింది. కెరమెరి మండలంలోని ఆయా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండల కేంద్రంలో ని శివాలయం, నెహ్రూనగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆ లయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లోగల కనక దుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయంలో భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు భారీగా తరలివచ్చారు. అమ్మవారికి ఒడిబియ్యం, పట్టువస్త్రాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని కాలభైరవస్వామి, శనేశ్వరుడు, అరుణాచల శివలింగాన్ని దర్శించుకుని పూజలు చేశారు.

రైతులను ఆదుకోవాలి


జైత్‌పూర్‌లో పత్తి చేన్లను పరిశీలిస్తున్న నాయకులు

వాంకిడి: అడ ప్రాజెక్ట్ నీళ్లతో పత్తి పంట నీట మునిగి నష్ట పోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని సీపీఎం నాయకులు కోరారు. శుక్రవారం మండలంలోని జైత్‌పూర్, బోర్దా గ్రామాల్లో నీట మునిగిన పత్తి పంటను బాధిత రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం దినేకర్, కోట శ్రీనివాస్ మాట్లాడారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అడ ప్రాజెక్ట్ ఏడు గేట్లను ఒకేసారి ఎత్తడంతో దిగువ ప్రాంతంలోని వాగు తీరంలోగల పత్తి పంటలు నీట మునిగాయని తెలిపారు. సుమారు 20మంది రైతులకు చెందిన 50 ఎకరాల పత్తి పంటకు నష్టం జరిగిందని పేర్కొన్నారు. బాధిత రైతులకు ప్రభుత్వం పరిహారం మంజూరు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు కార్తిక్, టికానంద్, అశోక్, తిరుపతి, శ్రీకాంత్, నిఖిల్, మల్లేశ్, రైతులు లక్ష్మణ్, మారుతి, రమేశ్, గణేశ్, తిరుపతి, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


కేజీబీవీలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్సీవిఠల్

దహెగాం: గ్రామాల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. మండలంలోని ఒడ్డుగూడ, చినరాస్పెల్లి, గెర్రె, గిరవెల్లి, కర్జి, హత్తిని, తిమ్మాపూర్ గ్రామాల్లో శుక్రవారం పనుల జాతర కార్యక్రమం ప్రారంభించారు. ఈజీఎస్ కింద మంజూరైన పనులకు భూమి పూజ చేసి, పూర్తయిన వాటిని ప్రారంభించారు. గిరవెల్లిలో పశువుల పాకకు సంబంధించిన బిల్లుల చెక్కులు పంపిణీ చేశారు. ఐదేళ్ల క్రితం వర్షాలకు దెబ్బతిన్న కర్జి చెరువు మత్తడిని పరిశీలించారు. అనంతరం గిరవెల్లి రైతువేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. స్థానిక కేజీబీవీని సందర్శించి ఇంకుడు గుంత నిర్మాణానికి భూమిపూజ చేశారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ కోండ్ర తిరుపతిగౌడ్, ఎంపీడీవో రాజేందర్, ఎంఈవో శ్రీనివాస్, ఏవో రామకృష్ణ, ఈజీఎస్ ఏపీవో కల్పన, ఎస్‌వో జ్యోతి, జెడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి, మాజీ జెడ్పీటీసీ రామారావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోతుగంటి భీమన్న తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం అందిస్తాం

దహెగాం: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెద్ద వాగు, ఎర్రవాగు పరీవాహక రైతులకు పరిహారం ఇచ్చి ఆదుకుంటామని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. శుక్రవారం మండలంలోని గిరవెల్లి, కర్జి శివారు ప్రాంతాల్లోని దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఏ పంటలు అధికంగా నష్టపోయారని వ్యవసాయాధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులు అధైర్య పడొద్దని ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. సర్వే పకడ్బందీగా చేపట్టాలని అధి కారులకు సూచించారు. ఆయన వెంట ఏవో రామక్రిష్ణ, ఏఈవో సుష్మిత, రైతులు ఉన్నారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శికి సన్మానం


మల్లికార్జున్‌యాదవ్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఇటీవల ఎన్నికైన జిల్లా కేంద్రానికి చెందిన అరిగెల మల్లికార్జున్‌యాదవ్‌ను పార్టీ నాయకులు శుక్రవారం ఆయన నివాసంలో శాలువాతో సన్మానించారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ మండలాధ్యక్షుడు సుంకరి పెంటన్న, మాటూరి జయరాజ్, ప్రసాద్, రేవతి, రేణుక పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం రెబ్బెన మండలానికి చెందిన 17 మందికి ఎమ్మెల్యే కోవ లక్ష్మి కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మర్సుకోల సరస్వతి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ అందజేత


నిర్మలకు మొబైల్ ఫోన్ ఇస్తున్న సీఐ

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రానికి చెందిన నిర్మల అనే మహిళ శుక్రవారం తన సెల్‌ఫోన్ పోగొట్టుకుని వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సెల్‌ఫోన్ ఆన్‌లో ఉండడంతో పోలీసులు 15 నిమిషాల్లోనే గుర్తించి బాధిత మహిళకు అందజేశారు. దీంతో బాధిత మహిళ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది.

గ్రామాల అభివృద్ధికి కృషి


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఇంద్రవెల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఈశ్వర్‌నగర్ గ్రామంలో గ్రామ పంచాయతీ భవనం ప్రారంభించారు. అనంతరం రూ. 97 వేలతో మంజూరు చేసిన గొర్రెల షెడ్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ రాథోడ్ రవీందర్, ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, కాంగ్రెస్ నాయకులు ఎండీ జహిర్, మసుద్, యాకుబ్‌బేగ్, కొరెంగా సుంకట్‌రావ్, రాథోడ్ సునీల్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

కాగజ్‌నగర్ టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ అడ్మిషన్ల వాల్ పోస్టర్‌ను ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు శుక్రవారం ఆవిష్కరించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి మాట్లాడుతూ.. ఇంటర్ పూర్తి చేసిన వారు ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ చదవాలనుకునే వారు కళాశాల స్టడీ సెంటర్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కటుకం మధూకర్, స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ దత్తు, దుర్గం జనార్దన్, సత్యనారాయణ, భాస్కర్ పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు


ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కౌటాల: మండలంలోని సదాశివపేట శివాలయంలో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ మాసం చివరి రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. సంమృద్ధిగా వర్షాలు కురిసి పాడి పంటలు బాగా పండాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు అంబెద సంతోష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చివేత


మొరం పోస్తున్న పాండురంగ్

కౌటాల: మండలంలోని పాత కన్నెపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో కన్నెపల్లి మాలీ యువజన సంఘం అధ్యక్షుడు మోర్లె పాండురంగ్ ట్రాక్టర్లతో మొరం వేయించి గుంతలు పూడ్చారు. వర్షాలకు రోడ్డు బురదమయంగా మారి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కనీసం నడవడానికి, వాహనాలు వెళ్లేందుకు ఇబ్బంది పడుతుండడంతో మొరం వేసినట్లు తెలిపారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు.

ఉపాధి కూలీలకు సన్మానం

కెరమెరి: వంద రోజుల పనిదినాలు పూర్తి చేసిన ఉపాధిహామీ కూలీలను మండలంలోని మోడి గ్రామపంచాయతీ కార్యాలయంలో అధికారులు శుక్రవారం శాలువాలతో సన్మానించారు. ఎంపీడీవో అమ్జద్‌పాషా, డీటీ సంతోష్‌కుమార్, ఏపీవో మల్లయ్య, మాజీ జెడ్పీటీసీ సెడ్మకి దుర్పతబాయి పాల్గొన్నారు.

పనుల జాతర పకడ్బందీగా నిర్వహించాలి


కార్మికులను సన్మానిస్తున్న ఎంపీడీవో కోట ప్రసాద్


భూమిపూజ చేస్తున్న నాయకులు

కాగజ్‌నగర్ రూరల్: ప్రభుత్వం చేపట్టిన పనుల జాతర కార్యక్రమాన్ని గ్రామాల్లో పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో కోట ప్రసాద్ అన్నారు. కాగజ్‌నగర్ మండలంలోని రాంనగర్, కడంబ, ఎస్సీవోస్ కాలనీలో పనుల జాతర కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులను శుక్రవారం సన్మానించారు. రాంనగర్, కడంబ గ్రామ పంచాయతీల్లో పుష్పబాల, నక్క విజయ్‌లకు ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పశువుల పాక పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీవో చంద్రశేఖర్, క్షేత్ర సహాయకులు సునీల్, అశోక్, సలీం, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కౌటాల: పల్లెల్లో 'పనుల జాతర'ను పకడ్బందీగా నిర్వహించాలని కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దల దేవయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని ముత్తంపేట, తలోడి, కౌటాల, శీర్ష గ్రామాల్లో ఇంకుడు గుంతల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. రైతుల అవసరాలను గుర్తించి కోళ్ల ఫారం, పశువుల కొట్టం నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పారిశుధ్య కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ మాంతయ్య, ఎంపీవో మహేందర్‌రెడ్డి, ఏపీవో పూర్ణిమ, ఈసీ సంతోష్, కార్యదర్శులు కవిత, సాయి, రమేశ్, విఠల్, తదితరులు పాల్గొన్నారు.

పశువుల పాకకు భూమిపూజ

బెజ్జూర్: మండల కేంద్రంలో శుక్రవారం పనుల జాతర కార్యక్రమాన్ని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్ భూమిపూజ చేసి ప్రారంభించారు. మండల కేంద్రంలోని గోల్కొండ గ్రామానికి చెందిన విమలకు పశువుల పాక ప్రభుత్వం ద్వారా రూ. 9 వేల ఉపాధిహామీ నిధులు మంజూరయ్యాయి. ఉపాధిహామీలో వందరోజుల పని చేసిన గాండ్ల పోశయ్యను సత్కరించారు. పనుల జాతర ప్రొసీడింగ్ కాపీలను లబ్ధిదారులకు అందజేశారు. బెజ్జూర్ మండలంలోని పోతేపెల్లి, కాటేపల్లి గ్రామాల్లో పశువుల పాకలను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో రాజన్న, ఈసీ రజినీకాంత్, బెజ్జూర్ కార్యదర్శి వైకుంఠం, టెక్నికల్ అసిస్టెంట్ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఒకరి రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై

కౌటాల: కౌటాలలో దొంగతనానికి పాల్పడిన ఒకరిని రిమాండ్‌కు తరలించనట్లు ఎస్సై విజయ్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో కేసు వివరాలను వెల్లడించారు. జూలై 16న చింతలమానెపల్లి మండలం డబ్బా క్రాస్‌రోడ్డు వద్ద గల శ్రీసాయి ఫర్టిలైజర్ షాపులో దొంగతనానికి పాల్పడి అదే రోజు రాత్రి కౌటాల మండల కేంద్రంలోని సదాశివపేట కాలనీకి చెందిన ఎడ్ల తిరుపతి ఇంట్లోకి చోరీ చేశారు. మండల కేంద్రంలోని పలు కూడళ్ల వద్ద బైక్‌పై వెళ్తున్నట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. కేసులో లోతుగా దర్యాప్తు చేసిన పోలీసులు చంద్రపూర్ జిల్లా ముల్చెర గ్రామానికి చెందిన సమీర్ సంతోష్ మండల్‌గా గుర్తించి రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడి కోసం గాలిస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

దుబార్‌పేట్‌లో వైద్యశిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఇచ్చోడ: మండలంలోని దుబార్‌పేట్‌లో శుక్రవారం ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌వో బ్రహ్మానందం రెడ్డి ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇంటి ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ రాజు బాయి, హెల్త్ అసిస్టెంట్ రాథోడ్ కైలాస్, సూభాష్, ఏఎన్ఎం సుధారాణి. వసంత పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో..

బోథ్: మండల కేంద్రంలోని సాంఘిక బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం వైద్యులు నవీన్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత గురించి వివరించారు. ఈ సందర్భంగా డ్రైడే నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నీటిని నిల్వ ఉంచవద్దు

నార్నూర్: ఇంటి ఆవరణలో నీటిని నిల్వ ఉంచవద్దని సీహెచ్‌సీ వైద్యాధికారి జితేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ముస్లింవాడలో వైద్య సిబ్బంది డ్రైడే నిర్వహించారు. వర్షాకాలంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. నిల్వ నీటితో దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. రోగుల వివరాలను సేకరించి వైద్యం అందించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ చరణ్‌దాస్ చౌహాన్, హెచ్‌ఈ తులసిదాస్ రాథోడ్, ఏఎన్ఎం శీల పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులు సద్వినియోగం చేసుకోవాలి


పశువుల పాక ప్రారంభిస్తున్న ప్రవీణ్‌కుమార్

వాంకిడి: ప్రజలు ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ సూచించారు. శుక్రవారం మండలంలోని గ్రామపంచాయతీల్లో ఉపాధిహామీ పనుల జాతర గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా సరాండి గ్రామపంచాయతీ పరిధిలో రూ.90వేలతో ఉపాధిహామీ నిధులతో నిర్మించిన పశువుల పాక ప్రారంభించారు. పలు గ్రామ పంచాయతీల్లో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఏపీవో శ్రావణ్‌కుమార్, ఈసీ మోసిన్, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.